క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీఅభయాంజనేయస్వామి

సింహాద్రిపురం : స్థానికంగా ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యాసరచన పోటీలలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసా పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో గత అక్టోబర్ నెలలో జరిగిన జరిగిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో ఎస్.వీరజ్యోతి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మానవత్వంను పెంపొందించు, విద్య ఆవిష్కృత అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలలో ఎస్.వీరజ్యోతి మొదటి బహుమతి సాధించిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అభ్యసన సామర్థ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ జాఫర్ సాధిక్

వేంపల్లె : విద్యార్థులలో ఉన్న అభ్యసన సామర్థ్యంపై ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక పాఠశాల, సెకండరీ స్కూలు కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు కాంప్లెక్స్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు బోధనలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ప్రధాన వేదిక స్కూలు కాంప్లెక్స్ అన్నారు. తరగతి గదిలో విద్యార్థులు అభ్యసనాల్లో వెనుకబడ్డ వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో ఉన్న అభ్యసన స్థాయిని పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ శివ మునెమ్మ, హెడ్మాస్టర్ ఎం.నాగాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చెన్నూరు : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) దైనందిన క్యాలెండర్, గోడ పత్రికలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి-2 సునీత, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభం ఆపస్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరీలోని అంశాలు ఉపాధ్యాయ వర్గానికి చాలా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అలాగే క్యాలెండర్ దేశభక్తి ప్రభోదాత్మకంగా ఉందని ఈ సందర్భంగా వారు ప్రశంసించారు. మార్చిలో జరగబోయే పదో తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బనరసయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మిరెడ్డి, బలరామిరెడ్డి, వెంకటశివుడు, నాగరాజు, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ, అధికారులు

చెన్నూరు : స్థానిక సరస్వతి నగర్, గాంధీనగర్, లక్ష్మీనగర్, యానాది కాలనీలలో జరుగుతున్న ప్రధాన డ్రైనేజీ కాలువ పనులను ఎస్ఈ ఎంపీ వీరన్న, డీఈ మురళి కొండారెడ్డిలు మంగళవారం పర్యవేక్షించారు. రూ.45 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన ఈ పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఏ ఈ వినోద్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నిరుపేదలకు ఒక వరం

వల్లూరు : రాష్ట్రంలోని నిరుపేదలకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ఒక వరం లాంటిందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం కమలాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షల 2 వేల విలువ చేసే చెక్కులను ఆయన అందచేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు. పథకం కింద ఇప్పటి వరకు వున్న వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. చికిత్స పొందిన రోగి పూర్తిగా కోలుకుని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేలు చెల్లిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి జీవం పోసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్‌సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



వల్లూరులో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి



పెద్దముడియం : వృద్ధురాలికి ఫించన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

కమలాపురం : రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అని డీఎంహెచ్ఓ నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లింగాయపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందజేశారు. శిబిరానికి వచ్చిన 300 మందిని వైద్యులు కాళ హస్తీశ్వర్‌రెడ్డి, మమతా రెడ్డి, ఎస్ఏఎస్ ఫరూక్, ప్రీతిలు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అలాగే బీపీ, షుగర్ తదితర రక్త పరీక్షలు చేసి రిపోర్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గతంలో కూడా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఫేజ్-2 జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మధ్యాహ్నం రోగులకు జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సరస్వతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో ఏ వ్యక్తికి వైద్యం ఆర్థిక భారం కాకూడదని గ్రామాల్లోనే ప్రత్యేక డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మొదటి విడత నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని సుంకేసుల సచివాలయ పరిధిలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, బిదినంచర్ల పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 5 మంది వైద్యుల బృందం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ పరిధిలోని నల్లచెరువుపల్లె, కొండ్రెడ్డి పల్లె, నారేపల్లె గ్రామాలకు చెందిన 302 మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

321 మందికి వైద్య పరీక్షలు

లింగాల : మండలంలోని పెద్దకుడాల సచివాలయ ఆవరణలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ అలవలపాటి రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలనతో పాటు వైద్య ఆరోగ్యాన్ని తీసుకరావడం జరిగిందన్నారు. దీంతో పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్యం అందించి మందులను పంపిణీ చేశారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో 321 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని నాయకుడు వైఎస్ జగన్

పెద్దముడియం : ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు, వితంతువులకు నెలకు ఫించన్ రూ.3000కు పెంచి మాట తప్పని నాయకుడిగా మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరూపించుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండంలోని పాలూరు గ్రామంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ఫించన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అర్హత కలవారు ఫించన్ కావాలంటే టీడీపీ నాయకుల ఇళ్ల దగ్గరకు పదుల సార్లు వెళ్లి ఫించన్ కావాలని మొరపెట్టుకోవలసి వచ్చేదన్నారు. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ఇంటి దగ్గరికే వలంటీర్ వెళ్లి ఫించన్ అందజేస్తున్నారన్నారు. దేశ చరిత్రలో 95 శాతం పైగా ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.కె.సుధ, మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, సాంబశివారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కమలాపురం : రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు



సింహాద్రిపురంలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



వేముల : రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



లింగాల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చౌకబారు విమర్శలు

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



పులివెందుల : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకుడు బీటెక్ రవి చౌకబారు విమర్శలు చేస్తున్నారని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు చిత్తశుద్ధితో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో రాష్ట్రంలోనే ముందుండాలని ధృడమైన సంకల్పంతో తమ నాయకులు అభివృద్ధి పనులు చేస్తుంటే.. ఓర్వలేని బీటెక్ రవి తన ఉనికి కోసం స్టేట్‌మెంట్లను ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో, అలాగే పులివెందుల మున్సిపాలిటీలో నాణ్యతకు రాజీ పడకుండా నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. అసలు చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క రూపాయి కూడా పులివెందుల నియోజకవర్గానికి నిధులు ఇవ్వలేదన్నారు. అలాగే బీటెక్ రవి 6 ఏళ్ల తన పదవి కాలంలో నియోజకవర్గానికి కానీ, తన సొంత మండలానికి కానీ అభివృద్ధి చేసిందేమీలేదన్నారు. బీటెక్ రవి మాట్లాడితే తమ పార్టీ అధికారంలోకి రాగానే అంటున్నారని.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది వారి కలగానే మిగిలిపోతుందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పులివెందులలో నీరు-చెట్టు పేరుతో లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని టీడీపీ నాయకులు దోచుకుతిన్నారన్నారు. దివంగత నేత వైఎస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మంచి మనస్సుతో ఈ ప్రాంత రైతుల కోసం గండికోటలో 26 టీఎంసీలు, సీబీఆర్‌లో 10 టీఎంసీలు, పైడిపాలెంలో 6 టీఎంసీల నీటిని నిల్వ చేయడం జరిగిందన్నారు. పులివెందులలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండు రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచిందన్నారు. అలాగే పులివెందులలో నిర్మించిన రాణితోపు, పార్కులు, రింగ్ రోడ్లు, గరండాల్ బ్రిడ్జి సుందరీకరణ, శిల్పారామంతో పాటు చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ప్రజలు హర్షిస్తున్నారన్నారు. పులివెందుల అభివృద్ధి విషయంలో వైఎస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అంతేకానీ పులివెందుల నియోజకవర్గం గురించి ఆలోచించని టీడీపీ నాయకులు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పులివెందుల అభివృద్ధి విషయంలో ఎప్పుడైనా చర్చకు వస్తే తాము సిద్ధమని ఆయన తెలిపారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మున్సిపాలిటీకి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మారుతి నగర్‌లోని వడ్డెర కాలనీలో రూ.6 లక్షల ఎంపీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాల, ఆసుపత్రి భవనాలు ప్రారంభించామన్నారు. రూ.36 కోట్లతో పట్టణం అంతా డ్రైనేజ్ పనులను పూర్తి చేశామన్నారు. అక్కడక్కడ ఉన్న డ్రైనేజ్ జాయింట్లను రోడ్డు నిర్మాణ పనులతో పాటు పూర్తి చేస్తామన్నారు. అలాగే ఇప్పటికే పట్టణంలో అవసరమైన చోట సీసీ రోడ్లు వేశామని, ఇంకా కొన్ని కాలనీల్లో వేయాల్సి ఉన్నాయని వాటిని కూడా మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. క్రాస్ రోడ్డులో ఆర్చి, రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయ్యాయన్నారు. ఇక బ్యూటిఫికేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం, ఆర్‌ఓబీ పనులు కూడా త్వరితగతిన ప్రారంభిస్తామన్నారు. మున్సిపాలిటీకి అవసరమైన పనులన్నీ పూర్తి చేసి కమలాపురంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, హిదాయత్, ఇస్మాయిల్, నిఖిల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, ఇర్ఫాన్, గౌస్‌మున్నా, లక్ష్మీ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాముడు, ఏఈ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఆర్‌ఓబీ పనులు వేగంగా చేయండి

పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన ఆర్‌ఓబీ పనులను వేగంగా చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రైల్వే గేటు సమీపంలో చేపట్టిన సాయిల్ టెస్టింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. పనుల నిర్వహణపై కాంట్రాక్టర్‌తో ఆరా తీశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, అలాగే పనుల్లో వేగం పెంచాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన ఆర్‌ఓబీ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇప్పటికే అన్ని అనుమతులు వచ్చాయని, సాయిల్ టెస్టింగ్ పూర్తి చేసి ఫలితాలు రాగేనే ఆర్‌ఓబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆర్‌ఓబీ పూర్తి అయితే ప్రజల గేటు కష్టాలు తొలగిపోతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి పని చేస్తోందన్నారు. ప్రజల కష్టాలు తన కష్టాలు భావించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కమలాపురం ఆర్‌ఓబీకు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కమలాపురం తాలూకా పెన్షన్ల సంఘం అధ్యక్షుడు పీవీ సుబ్బరాజు (84) కిడ్నీ సమస్యతో బాధపడుతూ మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పీవీ సుబ్బరాజు మండలంలోని ఎర్రగుడిపాడు, కోగటం తదితర గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా సేవలు అందించారు. 2000 సం.లో గంగవరంలో హెచ్ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి నగర పంచాయతీ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం కార్యాలయం ఏర్పాటు చేసి సంఘానికి అధ్యక్షుడిగా ఉండి పెన్షనర్లకు సేవలు అందించే వారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

వేంపల్లె : అయోధ్య శ్రీరామచంద్రుడి భవ్య మందిర నిర్మాణం మరియు ప్రాణ ప్రతిష్టాపన సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో కూడిన కరపత్రం, శ్రీరాముని చిత్రపటం, అక్షింతలను స్థానిక బీజేపీ నాయకులు ఇంటింటికి పంపిణీ చేశారు. మంగళవారం వేంపల్లె ఫియాతోట వీధి, బస్టాండు తదితర ప్రాంతాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ పెద్దలు మురళీ మనోహర్ జోషి, లాల్ కృష్ణ అద్వాని వంటి పెద్దలు ప్రాణాలైనా అర్పిస్తాం, రక్తాన్నైనా చిందిస్తాం, రామ మందిరం నిర్మిస్తామన్నారు. మందిర నిర్మాణం కోసం ఎంతో మంది బలిదానం అయ్యారన్నారు. 5 శతాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భవ్యమైన రామ మందిరాన్ని మనం చూస్తున్నామని తెలిపారు. జనవరి 22న స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రసార మాధ్యమాలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడాలన్నారు. అనంతరం ప్రతి ఇళ్లలో 5 దీపాలు వెలిగించాలన్నారు. జనవరి 22న దేశంలో పెద్ద ఎత్తున దీపావళి నిర్వహించి పండుగ చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అయోధ్య రాముడి అక్షింతలు, రాముని చిత్ర పటం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఆడుదాం.. ఆంధ్రా పోటీలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, ఖో ఖో తదితర పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ క్రీడలలో బాగా రాణించి మంచి పేరు తీసుకరావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



రసవత్తరంగా ఆడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఓటర్లుగా నమోదు కావడం పౌరుల విధి

జమ్మలమడుగు : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీలతో ఓటర్ల నమోదుపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఓటర్లుగా నమోదు కావడం భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు విధిగా భావించాలన్నారు. ఓటు హక్కు లేనివారు మరణించిన వారితో సమానం అన్నారు. విద్యార్థులు ఓటర్లుగా నమోదు చేసుకుని పల్లె ప్రాంతాలలో ప్రజలకు అవగాహనకల్పించాలని సూచించారు. ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీటీ షఫి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రదానం

పులివెందుల టౌన్ : నేత్రదానంతో ఇద్దరు అంధులక చూపును ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం పులివెందుల పట్టణానికి చెందిన నర్రెడ్డి పుల్లమ్మ అనారోగ్యంతో మరణించారు. ఆమె కుమారులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రసేకరణ కేంద్రంకు సమాచారం ఇవ్వడంతో వారు స్వగృహానికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపడం జరిగింది. నేత్రదానం చేసేవారు 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు, నేత్ర సేకరణ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

జమ్మలమడుగు : ఇంటింటికీ పంపిణీ చేసే రేషన్ ప్రజలకు సక్రమంగా అందించాలని తహసీల్దార్ గురప్ప తెలిపారు. మంగళవారం పట్టణంలో వివిధ ప్రాంతాలలో పంపిణీ చేస్తున్న వాహనాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఒక్కరూపాయికే కేజీ బియ్యం ఇస్తుందన్నారు. వాటిని అమ్ముకోకూడదన్నారు. ప్రజలు కూడా పంపిణీ చేస్తున్న రేషన్‌లో తూకాలను సక్రమంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని కడప ఆర్డీవో మధుసూదన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనంతో ఇస్తున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో రేషన్ సక్రమంగా అందుతోందా లేక ఏమైనా సమస్యలు వున్నాయా అని ఆరా తీశారు. బియ్యంతో పాటు ఇతర సరుకులు ఇవ్వకుంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా లబ్ధిదారులకు రేషన్‌ను అందించాలని ఎండీయూ వాహన నిర్వాహకునికి ఆదేశించారు. తమ క్లస్టర్ పరిధిలో రేషన్ పంపిణీ జరిగే సమయంలో గ్రామ వలంటీర్లు వాహనం వెంట వుండి ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా చూడాలన్నారు.



వల్లూరులో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

నేడు పింఛన్ పెంపు మహోత్సవం

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని జనవరి నెల నుంచి రూ.3 వేలకు పెంచడంతో 1వ తేదీ నుంచి 8వ తేదీవరకు అన్ని మండల, మున్సిపల్ హెడ్ క్వార్టర్స్‌లలో పింఛన్ పెంపు మహోత్సవాలు పండుగ రీతిలో జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పింఛన్ పెంపు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని.. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సమక్షంలో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమంతోపాటు లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, నోడల్ అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. పట్టణంలోని భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించనున్నామని.. ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

లింగాలలో..

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ చేతులమీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని.. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా సచివాలయాల్లో జరిగే పింఛన్ల పంపిణీలో పాల్గొనాలన్నారు.